క్లుప్తంగా

నర్సాపూర్(జి) ఎస్సైగా రవీందర్



నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) మండల నూతన ఎస్సైగా రవీందర్ పడ్వాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎస్సైగా పని చేసిన గీత జగిత్యాల జిల్లాకు వెళ్లగా నిర్మల్‌టౌన్ ఎస్సై రవీందర్ ఇక్కడకు వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని.. ప్రజలు సహకరించాలని నూతన ఎస్సై కోరారు.

భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కుర్నపేట్‌లో రూ.20 లక్షలతో చేపట్టే హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పనులకు గురువారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు చైర్మన్‌ను సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, కౌన్సిలర్ నల్లూరి పోశెట్టి, జగదీశ్, గోవర్ధన్, శ్రీనివాస్, వేణుగోపాల్, మహేశ్, పోశెట్టి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

తానూరు: మండలంలోని వడ్‌ఝరి(బి)లో దివటే వెంకట్‌రావ్ అనే రైతుకు చెందిన ఆవు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు వివరాల ప్రకారం రోజు మాదిరిగానే తన పొలంలో ఆవు మేస్తూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే ఆవు మృతి చెందింది.

గుడుంబా పట్టివేత

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి, సేవానాయక్‌తండాల్లో గురువారం ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా తండాల్లో కళావతి, పద్మ వద్ద 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నరేందర్, గౌతమ్, వెంకటేశ్, ఇర్ఫాన్, కల్పన తదితరులు ఉన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థి



విశ్వక్‌సేన్

నర్సాపూర్(జి): తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన బొరిగాం విశ్వక్‌సేన్ ప్రతిభ కనబర్చాడు. నరేందర్–అనురాధ దంపతుల కుమారుడు విశ్వక్‌సేన్ ఇంజినీరింగ్‌లో 1214వ ర్యాంకు సాధించాడు. నరేందర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా అనురాధ గృహిణి. బంధువులు, స్నేహితులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తానూరు: మండలంలోని హంగిర్గాలో గురువారం పంచాయతీ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై టీజీబీ మేనేజర్ సుధీర్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలను వివరించారు. సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, ఏపీఎం నారాయణ్‌రెడ్డి, సిబ్బంది సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఖానాపూర్: ఇటీవల పూర్తిస్థాయి బార్ అసోసియేషన్‌గా ఏర్పడిన కమిటీ సభ్యులను గురువారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక విశ్రాంతి భవనం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు సురేశ్, సత్యనారాయణ, రాజశేఖర్, ఆసిఫ్‌ను శాలువాలతో సన్మానించారు. అంబేడ్కర్ సంఘం మండలాధ్యక్షుడు నవీన్, శంకర్, సంతోశ్, రాజేశ్వర్, రాజన్న, అశోక్ తదితరులున్నారు.

కొనుగోళ్లలో జాప్యం వద్దు

నర్సాపూర్(జి): పంట కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ సుమతి నిర్వాహకులకు సూచించారు. గురువారం మండలంలోని నందన్, బామిని(బి) గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆర్ఐ వేణుగోపాల్, రాందాస్, నిర్వాహకులు ప్రవీణ్ పాటిల్, రవి పాల్గొన్నారు.

'పల్లెపల్లెకు బీజేపీ'

ముధోల్: మండలంలోని మచ్కల్ గ్రామంలో పల్లెపల్లెకు బీజేపీ–గడపగడపకు మోహన్‌రావ్ పటేల్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రంలో దళితుల్ని మోసం చేసి సీఎం పీఠం ఎక్కారన్నారు. సుమన్‌బాయి అనే మహిళ ఇంట్లో తేనీరు తాగుతూ దళితుల సమస్యలు తెలుసుకున్నారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

భూసార పరీక్షలకు సమయమిదే

- పరీక్షా ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు
- పెట్టుబడులు తగ్గుతాయంటున్న వ్యవసాయాధికారులు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచన



సూర్యాపూర్‌లో భూసార పరీక్ష కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏఈవో ప్రగతి

కుంటాల: వానాకాలం సాగుకు ముందు రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే మంచిది. పరీక్షా ఫలితాలతో నేల స్వభావం, అందులో పోషకాలు తెలుస్తాయి. అందుకు అనుగుణంగా పంటలకు ఎరువులు అందిస్తే పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

భూసార పరీక్షలతో భూమిలో పోషకాల లభ్యత ఏయే నిష్పత్తిలో ఉన్నాయో.. పంటలకు ఎంత మేర ఎరువులు వాడాలో తెలుస్తుంది. ఇటీవల కాలంలో పంటలకు మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగించడంతో భూమిలో సారం తగ్గుతుంది. దీంతో ఏయే పంటలు సాగు చేయాలి.. వాటికి ఎంత మోతాదులో మందులు, ఎరువులు వేయాలో భూసార పరీక్షల ద్వారా తెలుస్తుంది. తప్పనిసరిగా రెండేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు.. రైతులకు సూచిస్తున్నారు.

కొనసాగుతున్న నమూనాల సేకరణ..

ఏటా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందు భూసార పరీక్షలు చేస్తారు. మండలంలో 22,533 ఎకరాల్లో సాగు భూమి ఉండగా 8,420 మంది రైతులున్నారు. ఇప్పటికే మండలంలోని ఆయా గ్రామాల్లో ఏఈవోలు భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఎత్తు పల్లాలతో సంబంధం లేకుండా ఎకరంలో ఎనిమిది నుంచి పది చోట్ల మట్టి నమూనాలు సేకరించాలి. పొలంలో ఆంగ్ల అక్షరం వీ ఆకారంలో ఎనిమిది నుంచి పది సెంటీమీటర్ల లోతు గుంత తీయాలి. పై పొర నుంచి కింది పొర వరకు ఒక పక్క మట్టిని సేకరించాలి. ఎకరంలో ఎనిమిది చోట్ల తీసిన మట్టిని ఓ చోట కుప్పగా పోసి నాలుగు భాగాలుగా విభజించాలి. అందులో ఓ భాగం అరకిలో వచ్చే వరకు ఇలా నాలుగు భాగాల పద్ధతి అనుసరించాల్సి ఉంటుంది. మట్టిని కలిపేందుకు రసాయన ఎరువుల సంచులు వినియోగించకుండా పాలిథీన్ పరదా ఉపయోగించాలి. పొలంలో నేల వాలు, మట్టి రంగుల్లో తేడా లేనప్పుడు ఐదెరాలకు ఓ చోట నమూనా తీస్తున్నారు.

సేకరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

మట్టి నమూనాలు సేకరించేటప్పుడు చెత్తాచెదారం, ఆకులు, రాళ్లు రాకుండా చూసుకోవాలి. బురద, నీరు ఉన్న చోట నమూనా తీయొద్దు. ఒకవేళ తీయాల్సి వస్తే ఎండలో ఆరబెట్టి తర్వాత మట్టిని పరీక్షకు పంపాల్సి ఉంటుంది. పొలంలో అక్కడక్కడా చౌడుగా ఉంటే 15సెం.మీ నుంచి 30 సెం.మీ లోతుతో విడివిడిగా రెండు నమూనాలు సేకరించాలి. కాలిబాటలో, చెట్ల కింద, గట్ల పక్కన, ఎరువుల కుప్పల వద్ద, నమూనాలు సేకరించవద్దు.

ల్యాబ్‌కు ఇలా పంపించాలి..

రైతుల చేన్లో సేకరించిన మట్టిని గాలికి ఆరబెట్టాలి. ప్లాస్టిక్ కవర్లు, గుడ్డ సంచులు మాత్రమే వినియోగించాలి. వాటిపై రైతు పేరు, ఊరు, మండలం, ఇంతకుముందు వేసిన పంట, వాడిన ఎరువు, సాగు చేయబోయే పంటల వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు తరలించాలి.

ఎరువుల వాడకం తగ్గింది



రైతులు తమ చేనులో భూసార పరీక్షలు చేసుకోవాలి. నేను పరీక్షా ఫలితాల ఆధారంగా భూమిలో పంటలు సాగు చేయడంతో ఎరువుల వాడకం తగ్గింది. పంట దిగుబడి పెరిగింది. ప్రయోజనాలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. – సాయికిరణ్, రైతు, సూర్యాపూర్

పరీక్షలు చేయించుకుంటే మంచిది



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్లస్టర్ పరిధిలోని పంట చేన్లలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాం. పరీక్షా ఫలితాల ఆధారంగా ఏయే పంటలు సాగు చేయాలో రైతులకు తెలుస్తుంది. నేల స్వభావం తెలుసుకునేందుకు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుంటే మంచిది. రైతులు పంట మార్పిడి చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. – సోమలింగారెడ్డి, ఏవో

బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు?

- అధికారులను నిలదీసిన పలువురు సభ్యులు
- వాడీవేడిగా కుభీర్ మండల సర్వసభ్య సమావేశం



బిల్లులు రాలేదని ప్రశ్నిస్తున్న సర్పంచ్ సంగీత

కుభీర్: అప్పులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేశాం.. కానీ బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఇంకెప్పుడు మంజూరు చేస్తారని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కుభీర్ మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. పంచాయతీరాజ్ ఏఈ సూర్యతేజ మాట్లాడుతుండగా సౌన సర్పంచ్ సంగీత తాను ఏడాది కిందట సీసీ రోడ్ల పనులు పూర్తి చేసినా.. ఇప్పటికీ బిల్లులు రాలేదని వాపోయారు. దీనికి ఏఈ సమాధానమిస్తూ తాను నూతనంగా బాధ్యతలు స్వీకరించానని.. పరిశీలించి బిల్లులు వచ్చేలా మంజూరు చేస్తానని పేర్కొన్నారు. ఏపీవో హరిలాల్ మాట్లాడుతుండగా సర్పంచులు తాము ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లులు రాలేదన్నారు.

ఎంఈవో చంద్రకాంత్ మాట్లాడుతుండగా దావూజీనాయక్ తండా సర్పంచ్ శంకర్ మనఊరు– మనబడి కింద చేసిన పనులకు బిల్లులు రాలేదనగా తాను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. విద్యుత్తుశాఖ అధికారి జనార్దన్ మాట్లాడుతుండగా పార్డి(కె) గ్రామంలో హనుమాన్ మందిరం వద్ద స్తంభం విరిగిపోయిందని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ గంగాధర్ పేర్కొన్నారు. తాను కొత్త స్తంభం ఏర్పాటు చేయిస్తానని అధికారి తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ మినహా మిగతా శాఖల అధికారులందరూ హాజరయ్యారు. సమావేశంలో ఎంపీపీ తూము లక్ష్మీబాయి, ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ విశ్వంభర్, వైస్ ఎంపీపీ మోహినొద్దీన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



హజ్ యాత్రకు వెళ్లే వారితో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం హజ్‌యాత్రకు వెళ్లే భైంసా డివిజన్ పరిధిలోని 52 మంది ముస్లింలకు వ్యాక్సినేషన్‌తోపాటు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందన్నారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నయనారెడ్డి, భైంసా ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వీఆర్‌ఏలు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని తన నివాసంలో గురువారం వీఆర్‌ఏలు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యల పరిష్కారానికి మంత్రివర్గం ఆమోదం తెలపడంపై హర్షిస్తూ ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు ముత్తన్న, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు



కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా.. కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలని ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అనంతపేట్, సీలాయిపేట్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు అనంతరం అనంతపేట్‌లో కోట పెద్ద లింగన్న తమ్ముడి భార్య మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. సర్పంచ్‌లు విజయ, సాయన్న, ఎంపీటీసీ లలిత, డీసీసీబీ డైరెక్టర్ కోట గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ బొండ్ల గంగాధర్, అడేల్లి డైరెక్టర్ నర్సయ్య, ఏపీఎం గంగన్న, సీసీ జ్యోతిర్మయి, సీసీ మాదస్తు నర్సయ్య, ఐకేపీ గ్రామ అధ్యక్షురాలు ఉమ, జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఇంటినంబర్లను సరిచేయాలి

కడెం: ఓటరు గుర్తింపుకార్డ్‌లో తప్పుడు ఇంటి నంబర్లు ఉంటే సరి చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఆధార్‌కార్డ్‌లో ఉన్న నంబరే, ఓటర్‌కార్డులో ఉండాలని.. లేకుంటే ఓటరు గుర్తింపు కార్డులో ఇంటి నంబర్ మార్చాలని సూచించారు.

నేడు రాజకీయ నాయకులతో సమావేశం

కడెం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నియోజవర్గ స్థాయి రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చిన్నయ్య ప్రకటనలో పేర్కొన్నారు. ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాల నాయకులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు మెడల్స్ అందజేత

భైంసాటౌన్: పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక రిలయన్స్ ట్రెండ్స్ ఆధ్వర్యంలో పది, ఇంటర్ తరగతుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ట్రెండ్స్ మేనేజర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపూర్: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు సింహారాజుల ఆనంద్‌కు మాతృవియోగం కావడంతో గురువారం బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. కృష్ణ, గోదావరి జలాల రాష్ట్ర కన్వీనర్ రావుల రాంనాథ్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నర్సాగౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, మల్లయ్య, తిరుమలగిరి, గోపాల్‌రెడ్డి, పరమేశ్వర్‌గౌడ్, తదితరులున్నారు.

ఓలా గ్రామంలో..

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో హన్మాండ్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వెంకటరమణ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గురువారం బాధిత కుటుంబాలను ఐకేఆర్ పీఏ నాలం శ్రీనివాస్ పరామర్శించారు. వారి వెంట టీఎన్జీవో భైంసా యూనిట్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్, నా రాయణ, హుస్సేన్, సాయన్న తదితరులున్నారు.

బాబా ఆలయంలో సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. బాబాకు అభిషేకం, అలంకరణ, గణపతి, గౌరి, గోపూజ నిర్వహించారు. ఆయా గ్రామాల మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ప్రభుత్వ అధ్యాపకుల ప్రచారం

ఖానాపూర్: ప్రభుత్వ కళాశాలల్లో అందే నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సొంతం అవుతుందని ప్రిన్సిపాల్ హమీద్, అధ్యాపకులు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పట్టణంతోపాటు గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంతోశ్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

'ఆదర్శ'లో ప్రవేశ జాబితా విడుదల

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో వంద సీట్లలో ప్రవేశం కోసం ఏప్రిల్ 16న పరీక్ష నిర్వహించారు. కాగా ఎంపికైన విద్యార్థుల జాబితా గురువారం నోటీస్ బోర్డుపై పొందుపరిచినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోగా తమ నిజ ధ్రువీకరణ పత్రాలతో ఎంపికైన విద్యార్థులు పాఠశాలలో సంప్రదించాలని కోరారు. ఏడు నుంచి పదో తరగతి ఖాళీలను నిర్ధారించిన తర్వాత ఎంపికైన వారి జాబితా ప్రదర్శిస్తామని వారు వెల్లడించారు.

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఇటీవల పరీక్ష నిర్వహించారు. గురువారం విడుదల చేసిన జాబితాలో పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గున్నాల ప్రణయ, చంటి రజిత, ఉమ్రి అఖిల, అవదూత్ వార్ అభిరామ్, మాలేగాం మణికంఠరెడ్డి, తుమ్మ అవినాశ్ ఎంపికయ్యారు. కాగా వీరిని హెచ్ఎం ఎల్లన్న, గ్రామస్తులు అభినందించారు.

అటెన్షన్ ప్లీజ్ | పశువులతో పొంచి ఉన్న ముప్పు



భైంసాటౌన్ పట్టణంలో ప్రధాన రోడ్లపై పశువులు సంచరిస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పలువురు పోషకులు ఇష్టారీతిన జీవాలను వదిలేస్తుండడంతో బస్టాండ్ రోడ్డు, నిర్మల్, బాసర వెళ్లే దారిలో రోడ్లపై ఉంటున్నాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, ఫోన్: 98499 05889

బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గం



మామడలో ఎన్నికైన నూతన కార్యవర్గం



సోన్‌లో మండల కార్యవర్గం

మామడ: బీజేపీ ఓబీసీ మోర్చా మామడ మండల కార్యవర్గాన్ని గురువారం మండలకేంద్రంలో ఎన్నుకున్నారు. ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా పొన్నం సురేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా పసుపునూరి గణపతి, కొండ్ర భాస్కర్ కార్యవర్గ సభ్యుడిగా కర్ణ రవీందర్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రావణ్‌రెడ్డి, కొరిపల్లి లింగారెడ్డి, ఏలేటి చిన్నలింగారెడ్డి, లింగం యాదవ్, నరేశ్, రాములు వెంకటరమణ ఎంపీటీసీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సోన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. గురువారం సోన్‌లో ఓబీసీ మోర్చా సోన్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోన్ మండలాధ్యక్షుడిగా మేకల మల్లేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా దేశెట్టి సురేశ్, బాలాయి ప్రమోద్, ఉపాధ్యక్షులుగా లోలం నాగరాజు, కొంటి బాలకృష్ణ, దావ సాయన్న, ఖర్జూరం శ్రీనివాస్, కోశాధికారిగా పృథ్వీరాజ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేక ప్రేమ్‌కుమార్, గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు సుంకరి ముత్యం తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ సీపీఐ' కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలతో సీపీఐ నాయకులు

ఖానాపూర్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో గురువారం ఇంటింటికి సీపీఐ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల విధ్వంసానికి కేంద్రం యత్నిస్తుందన్నారు. దళితబంధు పథకాన్ని పారదర్శకంగా అమలు చేసి నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. నిర్మల్‌లో టెక్స్‌టైల్‌మిల్లు, స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేయాలన్నారు. వడగండ్ల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. పార్టీ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఎల్ఆర్ ఉపాలి, భూక్య రమేశ్, అంకం శంకర్, పిల్లి రమేశ్, శ్రీనివాస్, మురళి, స్వామి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే తనిఖీలు

- నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

నిర్మల్‌టౌన్: శాంతి భద్రతల పరిరక్షణ కోసం తనిఖీలు నిర్వహిస్తున్నామని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీవాడలో గురువారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్(కార్డన్ సెర్చ్) నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక టాటా మ్యాజిక్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నేరాల నియంత్రణ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకే ఈ తనిఖీలు చేపడుతున్నామన్నారు. కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొత్త వ్యక్తుల వద్ద వాహనాలు కొనవద్దని, పెండింగ్ చలాన్లు చెల్లించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లేశ్, ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరాలు ప్రారంభం



తానూరులో కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

నర్సాపూర్(జి): మండలంలోని బూర్గుపల్లి(జి) గ్రామంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ జాదవ్ విఠాబాయి ప్రారంభించారు. జాదవ్ శ్రావణ్, పంచాయితీ కార్యదర్శి శివకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని వంజర్ గ్రామంలో గురువారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

మండలంలో 19,281 మందికి పరీక్షలు..

తానూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమం గురువారం ముగిసినట్లు వైద్యురాలు రమ్యాగౌడ్ తెలిపారు. మండలంలోని 36 గ్రామాల్లో 19,281 మందికి కంటిపరీక్షలు చేయగా అందులో పురుషులు 9,297 మంది స్త్రీలు 9,984 మంది ఉన్నట్లు వెల్లడించారు. 2,485 మందికి కంటిఅద్దాలు పంపిణీ చేయగా మరో 3,383 మంది కోసం అద్దాలు ఆర్డర్ ఇచ్చామని రాగానే పంపిణీ చేస్తామన్నారు. సీహెచ్‌వో కాసీం, వైద్యులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.